
క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, అసోసియేషన్ ప్రతినిధులు రాకేష్‌గుడినియే, సంజీవ్‌కుమార్, పీఎస్ రాజు

ట్రేడర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

కవాడిగూడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ, ముషీరాబాద్ ట్రేడర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. గురువారం కవాడిగూడ- ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాకేష్ గుడినియే, ఉపాధ్యక్షుడు తలకొక్కుల సంజీవకుమార్, ప్రధాన కార్యదర్శి పీస్‌స్ రాజు, కోశాధికారి శేరుపల్లి గణేష్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆవిష్కరించారు.


కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా తదితరులు

తాత, తండ్రి అడుగుజాడల్లో నారా లోకేష్

రాంనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తాత ఎన్టీఆర్, తండ్రి చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో నడుస్తూ ఏపీ అభివృద్ధికి నారాలోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. గురువారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో ఏపీ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వాన్ని కోటికి పైగా చేయడంలో నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఐటీ మంత్రిగా నారా లోకేష్ అందిస్తున్న సేవలను ప్రశంసనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు కట్టి రాములు, ఎస్.ప్రకాష్, కిరణ్, రాజు, సుదర్శన్, బాలకృష్ణ, రామారావు, భానుప్రకాష్, సత్యనారాయణ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలి'

బర్కత్‌పుర/అంబర్‌పేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై విద్యార్థులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు నిండుతున్న సందర్భంగా యేడాది పాటు బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభ్యాయన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభ్యాయన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమూల్యమైనదని, ప్రతి విద్యార్థి రాజ్యాంగాన్ని చదవాలన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ నాయకులు దాసోజు నాగభూషణంచారి, మైలారం రాజు, యశ్వంత్, వర్కాల శ్రీకాంత్, భిక్షపతి, దయాకర్‌యాదవ్, బల్వీర్, నందుయాదవ్, కృష్ణకుమార్, క్షీరసాగర్, చిట్టి శ్రీధర్, సంతోష్, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

- ప్రొఫెసర్ కాశీం డిమాండ్

రాంనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని ప్రొఫెసర్ కాశీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ అధ్యక్షతన రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం గౌరవించి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే, వర్గీకరణ అయ్యేంతే వరకు ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు మెగా ఇండస్ట్రీయల్ ప్యాక్టరీలను ప్రారంభించి పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. లెదర్ ఇండస్ట్రీ ప్రమోషన్ ఆఫ్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి చైర్మన్, డైరెక్టర్లను వెంటనే నియమించాలని, రూ.12 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఫిబ్రవరి 7న ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నతానియల్, బెజ్జంకి రాంబాబు, వశపాక నర్సింహ, పల్లెల వీరస్వామి, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'ముషీరాబాద్‌లో రోడ్లను ఆధునికీకరించాలి'


ముషీరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్, దాయారకమాన్, పఠాన్‌బస్తీ, జంజంమసీద్ ప్రాంతాల్లో రోడ్లను ఆధునికీకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన ప్యాచ్‌వర్కు రోడ్డు నిర్మాణ పనులను శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్ల సమస్యలపై ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిబ్బందితో ప్యాచ్‌వర్కు పనులు చేపట్టారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, సయ్యద్ సర్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి'

ముషీరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ మనోజ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పీహెచ్‌ఎన్ కమలమ్మ, ఏఎన్‌ఎంలు అనూష, సంతోషిణి, ఎంపీహెచ్‌ఏ యాదగిరి, రాజు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


రాంనగర్ డివిజన్‌లోని కృష్ణానగర్ బస్తీలో గురువారం కార్పొరేటర్ కె.రవి చారి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, రోడ్డు సమస్యలను పరిశీలించారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు.

\- రాంనగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి)



అంబర్‌పేట డివిజన్‌లోని పటేల్‌నగర్‌లో అంతర్గత రోడ్లకు జీహెచ్‌ఎంసీ సిబ్బందితో ప్యాచ్ వర్క్ చేయిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

\- అంబర్‌పేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి)




నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, పద్మజ, తదితరులు


గాంధీనగర్ డివిజన్‌లో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్


భోలక్‌పూర్‌లో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హిందూవాహిని రాష్ట్ర నాయకుడు బబ్లూ, తదితరులు

నేతాజీకి ఘన నివాళి

ముషీరాబాద్/చిక్కడపల్లి/కవాడిగూడ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి కార్యక్రమాలను ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటాలకు, విగ్రహాలకు పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డితో పాటు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో వివేక్‌నగర్ బస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భోలక్‌పూర్‌లో హిందూవాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో పలువురు పాల్గొని నేతాజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

రింగ్‌రోడ్ లోపల భూములన్నింటినీ రెసిడెన్షియల్ జోన్లుగా మార్చాలి

- బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.మల్లారెడ్డి తదితరులు

నల్లకుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను పునర్ సమీక్షించి, రింగ్‌రోడ్ లోపల ఉన్న రైతుల భూములన్నింటినీ రెసిడెన్షియల్ జోన్లుగా మార్చాలని బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 7 జిల్లాలు, 70 మండలాలు, 849 గ్రామాలు, 7 వేల 257 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉందని, ఈ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని, రోడ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుందని, ఔటర్ రింగ్‌రోడ్ నిర్వహణ అధ్వాన్నంగా మారిందని పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ జోన్ల విభజన బడాబాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తప్ప, రైతులకు ఏ మాత్రం అనుకూలంగా లేదని, సుమారుగా 50వేల మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్, శంషాబాద్, నార్సింగ్, పటాన్‌చెరువు, ఐడీఏ బొల్లారం, శంభీపూర్ తదితర ప్రాంతాల్లో సర్వీసు రోడ్లు పూర్తి చేయాలన్నారు. నార్సింగ్, పటాన్‌చెరువు, దుండిగల్ జంక్షన్ల పరిధిలో కొనసాగుతున్న కర్మాగారాలు, ఇతర నిర్మాణాలను హెచ్‌ఎండీఏ స్వాధీనం చేసుకోవాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్‌కు రైలుమార్గం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ స్థాపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శంషాబాద్ వద్ద రింగ్‌రోడ్డును విమానాశ్రయానికి నేరుగా అనుసంధానించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్, రంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, ప్రసన్ననాయుడు, కుమరయ్య తదితరులు పాల్గొన్నారు.


గిడుగు రామ్మూర్తి అవార్డులను అందజేస్తున్న జస్టిస్ రాధారాణి

గిడుగు రామ్మూర్తి సేవలు మరువలేనివి

రాంనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా, సాహిత్యాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి అందించిన సేవలు మరువలేనివని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి పేర్కొన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు రామ్మూర్తి ఫౌండేషన్, శంకరం వేదికల ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ రాధారాణి హాజరై మాట్లాడారు. గిడుగు రామ్మూర్తి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం గిడుగు రామ్మూర్తి అవార్డులను ప్రముఖులకు ఆమె ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగు 1 వ్యవస్థాపకులు కంఠంనేని రవిశంకర్, ఫౌండేషన్ అధ్యక్షురాలు గిడుగు కాంతికృష్ణ, సాహితీవేత్తలు డాక్టర్ విజయలక్ష్మి పండిట్, డాక్టర్ విద్యాధర్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్‌కు రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

- ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి
- ఎంపీ ఆర్.కృష్ణయ్య


అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, మణికంఠ, రాజు నేత, తదితరులు

బర్కత్‌పుర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్‌కు 4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి ప్రతి బీసీ కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ బంధు పథకాన్ని వెంటనే ప్రవేశపెట్టాలని, ఎంబీసీ కార్పొరేషన్‌కు 2 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలన్నారు. గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ 12 బీసీ కులాల ఫెడరేషన్లకు 2వేల కోట్ల రూపాయలను కేటాయించాలన్నారు. మరో 30 బీసీ కులాలకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి పాలకమండలిని నియమించాలన్నారు. బీసీ కార్పొరేషన్ ఈడీ పోస్టులను గతంలో రద్దు చేశారని, వాటిని వెంటనే పునరుద్ధరించి అర్హులైన వారికి రుణాలు ఇవ్వాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.250 కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీల వెంకటేష్, జి.మల్లేష్, జి.అంజి, వేముల రామకృష్ణ, నందగోపాల్, సుధాకర్, రాజునేత, రాందేవ్‌మోదీ, భాస్కర్, రఘుపతి, ప్రవీణ్‌కుమార్, జి.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మెగా చెస్ టోర్నమెంట్

- వరాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వరాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి అండర్ 15 ఆలిండియా మెగా చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అకాడమీ ఫౌండర్, చీఫ్ కోచ్ రాఘవ్ శ్రీవాత్సవ్ వరయోగి తెలిపారు. జాతీయ స్థాయిలో రెండోసారి ఏర్పాటు చేస్తున్న మెగా చెస్ టోర్నమెంట్ విజేతలకు రూ.75 వేల నగదుతోపాటు 50 ట్రోఫీలు అందిస్తామన్నారు. బేగంపేట పాటిగడ్డ జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్(రసూల్‌పురా మెట్రోస్టేషన్) సమీపంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 7396847937 నంబర్‌ను సంప్రదించాలని, లేదా వివరాలకు www.varaschessacadamy.com వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపారు.

నేడు అంబర్‌పేటలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

అంబర్‌పేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం అంబర్‌పేట డివిజన్‌లో పర్యటిస్తారని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేష్ గౌడ్ తెలిపారు. సీపీఎల్‌లోని ప్రభుత్వ పోలీసు బాయిస్ పాఠశాలలో ఉదయం 9 గంటలకు విద్యార్థులకు బెంచెస్ పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

భోలక్‌పూర్‌లో...

ముషీరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 11గంటలకు భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో పర్యటించనున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు నందగిరి నర్సింహ, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం తెలిపారు. గురువారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఇటీవల సిద్దిపేటలోని కొండపోచమ్మ జలాశయంలో ఈతకు వెళ్లి మృతిచెందిన యువకుల కుటుంబాలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరామర్శిస్తారని తెలిపారు. అనంతరం భోలక్‌పూర్‌లో పర్యటించనున్నట్లు తెలిపారు.

హెబ్రోన్ చర్చి వద్ద మరోసారి ఆధిపత్యపోరు

- చర్చికి లోపలినుంచి గేటుకు తాళం.. ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు

చిక్కడపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చివద్ద మరోసారి ఆధిపత్యపోరు తీవ్రస్థాయికి చేరడంతో గురువారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. హెబ్రోన్ సొసైటీకి చెందిన రాగి వీరాచారి తన అనుచరగణంతో చర్చిలోనికి వెళ్లి లోపలినుంచి గేటుకు తాళం వేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమకు కోర్టు నుంచి ఆర్డర్ ఉందని, ఇతరులను లోనికి రానివ్వకపోవడంతో గందరగోళపరిస్థితి నెలకొంది. ప్రస్తుతం లోకల్‌బాడీ ఆధీనంలో చర్చి నిర్వహణ కొనసాగుతుండగా రాగివీరాచారి అనుచరులు అక్రమంగా చొరబడి తమను భయభ్రాంతులకు గురిచేసి చర్చిని స్వాధీనం చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భారీగా ఇరువర్గాలవారు రావడంతో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు రాజునాయక్, రాంబాబు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గేటులోపలినుంచి వేసిన తాళాన్ని తీయాలని పోలీసులు కోరినా వీరాచారి తీయలేదు. చర్చి వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్‌కుమార్), క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు గుండు జగదీశ్‌బాబు, అభిషేక్ కెన్నడీ చేరుకుని పరిస్థితిని అదుపుచేసేయత్నం చేశారు. ఇరువర్గాల వారు శాంతియుతంగా చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ పంచాయితీ చిక్కడపల్లి పీఎస్‌కు చేరింది. రాత్రి పదిగంటల వరకు కూడా సమస్యకు పరిష్కారం లభించలేదు. కాగా, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు పీఎస్ వద్ద మీడియాతో మాట్లాడుతూ చర్చిలోనికి వీరాచారి అక్రమంగా చొరబడ్డారని ఆరోపించారు. చర్చిలో రూమ్‌లు ధ్వంసం చేశారని తెలిపారు.

పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలి: వీరయ్య

ముషీరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో దేశభక్తిని, సమాజంపై అవగాహన పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య అన్నారు. గురువారం ముషీరాబాద్‌లో గణతంత్ర దినోత్సవ వజ్రోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ జిందాబాద్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీరయ్య మాట్లాడుతూ... తమ కమిటీ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా వంద పాఠశాలల్లో దేశభక్తిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ఫిబ్రవరి 2న రవీంద్రభారతిలో ప్రముఖులతో సర్టిఫికెట్లు, బహుమతులను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ నాయకులు శ్రీవల్లీ, యాదగిరి, సాంబశివరావు, రజిని, అరుణ్, లక్ష్మణ్, వెంకటేష్, చారి, రాజమౌళి, రఘు, భారతి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి వీహెచ్ కృషి

- సీపీ సీవీ.ఆనంద్

రాంనగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి మాజీ ఎంపీ, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వి.హనుమంతరావు చేస్తున్న కృషి అభినందనీయమని నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం ఎల్.బి.స్టేడియంలో క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 47వ ఆలిండియా రాజీవ్‌గాంధీ అండర్ 19 ట్వంటీ ట్వంటీ లీగల్ క్రికెట్ మ్యాచ్‌లో శ్రీలంక వర్సెస్ తమిళనాడు జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను సీపీ సీ.వీ.ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ శంభుల శ్రీకాంత్‌గౌడ్, అధ్యక్షుడు సయ్యద్ సాదిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

'కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌ను రద్దు చేయాలి'

రాంనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాలను కలుపుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటును రద్దు చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్ ఆధ్వర్యంలో పలు లంబాడీ సంఘాల ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందజేశారు అనంతరం సంజీవ్‌నాయక్ మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపాలిటీలో ఏజెన్సీ ప్రాంతాలను కలిపితే ఆదివాసీలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకుడు రమేష్‌నాయక్, నాయకులు వీరునాయక్, హుస్సేన్‌నాయక్, రాములునాయక్, వీరన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

చిక్కడపల్లి వేంకటేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.30.13 లక్షలు

చిక్కడపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వరాలయం 98 రోజుల హుండీ ఆదాయం 30లక్షల 13వేల405 రూపాయలు వచ్చింది. వీటిలో 28లక్షల81వేల449 రూపాయలు కరెన్సీ రూపంలో, లక్షా31వేలా956 రూపాయలు కాయిన్స్. ఫారిన్ కరెన్సీ ఆస్ట్రేలియా డాలర్స్ 10, యూకే పౌండ్స్ 10, సౌదీ రియాల్స్ 5, కతార్‌రియాల్ 1 వచ్చాయని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో ఎస్.అన్నపూర్ణ తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో దేవాలయ సిబ్బంది, భక్తులు, చిక్కడపల్లి యూనియన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవ రిజర్వేషన్‌ను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం: సీఏ డానియల్ ఆడమ్స్

కవాడిగూడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవ రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ది నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్ అధ్యక్షుడు సీఏ డానియల్ ఆడమ్స్ ఆరోపించారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీజేపీ పాలిత రాష్ట్రాలలో క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, ఒరిస్సా రాష్ట్రంలో హత్యకు గురైన ఆస్ట్రేలియన్ మిషనరీకి చెందిన డాక్టర్ గ్రహం సెయిన్స్ ఆయన ఇద్దరు మైనర్ కుమారుల 26వ వర్ధంతి సందర్భంగా గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ది నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండియన్ క్రిస్టియన్ అధ్యక్షుడు సీఏ డానియల్ ఆడమ్స్, క్రిస్టియన్ నేతలు టీపీసీసీ మైనార్టీ సెల్ కార్యదర్శి కెనడి కృపారావు, గోనే సాల్మాన్, కెనడి, డాక్టర్ సాధు సత్యానంద్, క్రిస్టియన్ సంఘాల జేఏసీ నేత జెరుసలెం మత్తయ్య హాజరై మాట్లాడారు. దేశంలో ఉన్న దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు తీసుకువచ్చి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పాస్టర్లకు, చర్చిలకు, క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రత్యేక క్రైస్తవ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ధర్నాలో క్రైస్తవ సంఘాల నేతలు బిషప్ విల్సన్ సింగం, రాథమాథ్యూస్, అభిషేక్ కెనడి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

రాంనగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల కొరఢా ఝుళిపించారు. ఫుట్‌పాత్‌లను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు బాగ్‌లింగంపల్లిలోని పలు రహదారులతో పాటు సుందరయ్య పార్కు చుట్టూ వెలిసిన 30 డబ్బాలు, 20 షెడ్‌లను జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు తొలగించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, అదనపు డీసీపీ రాందాస్ తేజావత్, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ పర్యవేక్షణలో కూల్చివేతలు జరిగాయి.

రైలు ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగు చోరీ

బర్కత్‌పుర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బంగారు కమ్మలు ఉన్న హ్యాండ్ బ్యాగు లాక్కొని దొంగ పారిపోయాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన కిష్టమ్మ భర్తతో కలిసి బిక్కనూరు నుంచి కాచిగూడకు కాచిగూడ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తున్నారు. మహారాష్ట్ర పూర్ణ వద్ద రైలు బోగిలోకి వచ్చిన దొంగ కిష్టమ్మ వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగును లాక్కొని పారిపోయాడు. దానిలో ఐదు గ్రాముల బంగారు కమ్మలు, ఒక సెల్‌ఫోన్, 1500 నగదు ఉంది. గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో కిష్టమ్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి


సాయిబాబా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ సంజీవయ్యనగర్‌లో గల సాయిబాబా దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సేవాభావంతో పనిచేస్తూ పేదలను ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, ముప్పిడి నర్సింగ్‌రావు, లోకేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.